సాక్షి తిరుపతి

మంగళవారం । 26 । ఆగస్టు । 2025



వైఎస్సార్‌సీపీ నేత గోడ ధ్వంసం

వైఎస్సార్ సీపీ కోట మండల ప్రధాన కార్యదర్శి సురేంద్ర ఇంటి ప్రహరీ గోడను కొందరు దౌర్జన్యంగా కూల్చివేశారు. - 8లో



విన్‌టెక్ ఉద్యోగుల బైఠాయింపు

తమను తొలగించిన విన్‌టెక్ కంపెనీపై చీటింగ్ కేసు నమోదు చేయాలని ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. - 8లో



పోలీసు గ్రీవెన్స్‌కు 106 అర్జీలు

ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 106 ఫిర్యాదులందాయని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

రుసా కోర్డినేటర్ రాజీనామా!

తిరుపతి సిటీ: రుసా కోర్డినేటర్‌పై ఎస్వీ అధికారుల ఒత్తిడి ఎక్కువ కావడంతో రాజీనామా చేసి, ఆ లేఖను వైస్ చాన్సలర్‌కు పంపారు. నిధుల వినియోగంపై వర్సిటీ అధికారుల వేధింపులు ఎక్కువ అయ్యాయని ఆమె విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో ఆమె బహిరంగంగా వీసీకి రాజీనామా లేఖను సంధించడంతో వర్సిటీలో పెద్ద ఎత్తున్న చర్చనీయాంశమైంది. రుసా నిధులు దుర్వినియోగం కావడానికి ఆమె సమ్మతించకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని వర్సిటీలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

పీజీ అడ్మిషన్ల మాటేమిటో?

తిరుపతి సిటీ: విద్యాసంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఇంతవరకు పీజీసెట్–2025 అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంపై విద్యార్థులు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యను నిర్వీర్యం చేస్తోందని, ఇందులో భాగంగానే పీజీ అడ్మిషన్లపై దృష్టి సారించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించి పీజీ సెట్ పరీక్షలను ప్రస్తుతం ఆయా వర్సిటీ పరిధిలో అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయోమయ నిర్ణయాలతో జిల్లాలోని ఎస్వీయూ, పద్మావతి, ద్రవిడ యూనివర్సిటీల్లో ఈ ఏడాది కనీసం 50 శాతం ప్రవేశాలు జరిగే పరిస్థితి దాటదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేత్రదానంతో చూపునిద్దాం



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: నేత్రదానంతో మరో వ్యక్తి చూపునిద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా పోస్టర్‌తోపాటు బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డీంహెచ్‌ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆనందమూర్తి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో హైకోర్టు జడ్జి



ఆస్థాన మండపంలో హైకోర్టు జడ్జి హరిహరనాథశర్మ

నారాయణవనం:స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారిని సోమవారం రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ హరిహరనాథశర్మ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న జడ్జికి ఆలయాధికారులు, అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి, అమ్మవార్లకు జరిగిన ప్రత్యేక అర్చనలో జడ్జి పాల్గొన్నారు. అనంతరం ఆస్థాన మండలంలో ఆలయ మర్యాదలతో అర్చకులు శేషవస్త్రాన్ని కప్పి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కూటమిపై కన్నెర్ర

పలు సామాజిక వర్గాలు కూటమి పాలనపై కన్నెర్ర చేశాయి. దీంతో సోమవారం తిరుపతి కలెక్టరేట్ ధర్నాలతో దద్దరిల్లింది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) సందర్భంగా పలు వర్గాలు ఆందోళనలు చేపట్టాయి. ప్రభుత్వం తీరుపై దుమ్మెత్తిపోస్తున్నాయి. తమ న్యాయమైన తమ సమస్యల కోసం పోరాటాలకు దిగుతున్నాయి. ఈ క్రమంలో దివ్యాంగులు, రజకులు, విద్యార్థులు ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

- పింఛన్ల కోసం దివ్యాంగుల ధర్నా
- ఎస్సీలో చేర్చాలంటూ రజకులు
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు విద్యార్థులు
- మద్యం షాపు సమస్యపై గౌడ సంఘం నేతలు
- రేణిగుంటలోని విన్‌టెక్ పరిశ్రమ ఉద్యోగుల ఆందోళన



ఎస్సీల్లో చేర్చాలంటూ ఆందోళన చేస్తున్న రజకులు



ధర్నా చేస్తున్న దివ్యాంగులు

తిరుపతి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా పలువర్గాలు నిరసనలు చేపట్టాయి. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 321 అర్జీలు వస్తే అందులో 151 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే అందుకున్నారు. ప్రధానంగా దివ్యాంగులు అధిక సంఖ్యలో రావడంతో వారి కోసం డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు నేతృత్వంలో అర్జీలను స్వీకరించడానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, శివశంకర్ నాయక్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు సిగ్గుచేటు

కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లు తొలగించడ సిగ్గుచేటని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు మండిపడ్డారు. కలెక్టరేట్ వద్ద సోమవారం పెద్ద ఎత్తున దివ్యాంగులు తమ పింఛన్ల తొలగింపునకు నిరసనగా ధర్నా చేశారు. వారికి మద్దతుగా విచ్చేసిన సీపీఎం నేత నాగరాజు మాట్లాడుతూ 'కొందరికి రెండు కాళ్లు లేవు..ఇంకొందరికి రెండు చేతులు లేవు..మరికొందరు మంచానికే పరిమితం అయ్యారు. అయినా వారి పింఛన్లు తొలగించారు. రీవెరిఫికేషన్‌లో డాక్టర్లు పరీక్షలు చేసి



కలెక్టర్‌ను కలవడానికి వెళుతున్న దివ్యాంగులు



కలెక్టరేట్‌కు వస్తున్న దివ్యాంగురాలు

వికల్పతం నిర్ధారణ చేశారా? లేక చేతికి ఏదీ వస్తే అది రాసి ఇచ్చారో అర్థం కావడం లేదు.' అని నిప్పులు చెరిగారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి ఓ వినతిపత్రం అందజేశారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కళాశాలలకు చెల్లించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద విద్యార్థులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. కళాశాలల నుంచి ఫీజులు చెల్లించాలంటూ తీవ్రమైన ఒత్తిడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతున్నారని ఆందోళన చెందారు. దీంతో కోర్సులు పూర్తి చేసినా సర్టిఫికెట్లు లేకపోవడంతో ఉద్యోగావకాశాలు కోల్పోతున్నామని వాపోయారు. వారికి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, జిల్లా ఉపాధ్యక్షుడు రవి, నేతలు అశోక్, వినోద్, తేజ,రవీంద్ర, శివ తదితరులు మద్దతు తెలిపారు.

మా వైన్స్ షాపును నడవకుండా దౌర్జన్యాలు చేస్తున్నారు..

పుత్తూరు మండలంలోని కార్వేటినగరం కళ్యాణపురంలో కల్లుగీత కార్మికులకు వైన్స్ షాపు కేటాయించారని అత్తిరాల నారాయణ తెలిపారు. అయితే స్థానికంగా ఉన్న అగ్రకులానికి చెందిన దిలీప్‌కుమార్ తమపై దౌర్జన్యాలు చేస్తున్నారని, తమ మద్యం షాపు నడుపుకోనీయుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలిపారు. తమ దుకాణంపై దాడులు చేశారని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. లేదంటే గౌడ్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

కలెక్టరేట్ వద్ద విన్‌టెక్ ఉద్యోగుల ఆందోళన

రేణిగుంటలోని విన్‌టెక్ పరిశ్రమలో పనిచేస్తున్న 200 మంది ఉద్యోగులను తొలగించడంతో వారంతా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్న తమను ఆకారణంగా తొలగించడం దారుణమన్నారు. పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ విన్‌టెక్ ఉద్యోగులకు న్యాయం చేయాలని పరిశ్రమ విభాగం అధికారులను ఆదేశించారు. ఆ మేరకు పరిశ్రమలశాఖ అధికారులు ఉద్యోగులతో మాట్లాడారు.

ఎన్నికల హామీ నెరవేర్చాలి

సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో రజకులను ఎస్సీల్లో చేర్చుతామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని ఆ సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాది రాష్ట్రాల్లో రజకులు ఎస్సీలుగా ఉన్నారని, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోనూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిరత్నం, సుబ్రమణ్యం, గున్నయ్య, భక్తవత్సలం, గురవయ్య, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ధర్నా చేస్తున్న విద్యార్థులు

వినాయక ఆలయాన్ని తొలగించొద్దు



తిరుచానూరు నేతాజీ నగర్‌లోని వినాయకుడి ఆలయాన్ని తొలగించొద్దు. గతంలో పంచాయితీ అధికారుల అనుమతితోనే ఆలయాన్ని నిర్మించారు. అయితే రోడ్డు వేయాలంటూ ఆలయాన్ని తొలగించడం న్యాయం కాదు. హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఆ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రాం ఇచ్చాం. దీంతో ఆయన డీపీఓ సుశీలాదేవికి పరిశీలించమని ఆదేశాలు ఇచ్చారు. ఆలయాన్ని తొలగిస్తే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తాం. – పుష్పారెడ్డి, తిరుచానూరు

వైకల్యం తగ్గింపు నాకు బాధేస్తోంది



నేను 90 శాతం అంగవైకల్యంతో బాధపడుతున్నాను. రెండు కాళ్లు పనిచేయవు.. మూడు చక్రాల బండికి పరిమితమయ్యాను. పుట్టుకతోనే కాళ్లు పనిచేయకున్నా ఎన్నడూ బాధపడలేదు. ఈ ప్రభుత్వంలో రీవెరిఫికేషన్ చేసి 60 శాతం మాత్రమే వైకల్యం వున్నట్టు ధ్రువీకరణ పత్రం ఇవ్వడంతో బాధపడుతున్నాను. అంగవైకల్యంతో బాధపడుతున్న నన్ను బాధపెట్టే ఏ ప్రభుత్వమైనా బాధపడాల్సిందే.. పింఛన్లు తగ్గించుకోవడం కోసం ఇంతలా దిగజారాల్సిన పనిలేదు.
– ఖాదర్‌సాహెబ్, దివ్యాంగుడు, జీవకోన, తిరుపతి

చేతులు లేని నేను ఎలా బతకాలి



13 ఏళ్ల వయస్సులో విద్యుత్ షాక్‌కు గురై రెండు చేతులు పోగొట్టుకున్నా. దివ్యాంగ పింఛన్ తీసుకుంటున్నాను. ఏ ప్రభుత్వం వచ్చినా నా పింఛన్ తీయలేదు. ఎందుకంటే కళ్లతో చూడగానే నాకు చేతులు లేవని 100 శాతం వైకల్యం ఉన్నట్టు వైద్యులు కూడా నిర్ధారణ చేశారు. రీ వెరిఫికేషన్‌కు వచ్చిన వైద్యులు నా పరిస్థితిని కళ్లారా చూసి 40 శాతం కంటే తక్కువగా వైకల్యం ఉందని నిర్ధారణ చేశారు. నా పింఛను కూడా రద్దు చేస్తామని సచివాలయం ఉద్యోగులు చెప్పారు. రెండు చేతులు లేని నేను ఏ పనిచేసుకుని బతకాలో ప్రభుత్వ పెద్దలు చెప్పాలి. – దక్షిణాదిబాబు, దివ్యాంగుడు, నక్కలకాలనీ, తిరుచానూరు

అప్పుడు 90 శాతం..ఇప్పుడు 58 శాతం



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 90 శాతం వికలత్వం ఉండేది. దాంతో రూ.6 వేలు ఫించన్ ఇచ్చేవారు. తాజాగా కూటమి ప్రభుత్వంలో చేపట్టిన రీవెరిఫికేషన్‌లో 58 శాతం వికలత్వం చూపించారు. ఎంబీఏ చదువుకున్న నేను రిజర్వేషన్ కోల్పోతాను. 70 శాతం కంటే తక్కువ వికలత్వం ఉంటే ప్రభుత్వ పథకాలు అందవు. నాకు న్యాయం చేయాలని సోమవారం జరిగిన ధర్నాలో పాల్గొని, అధికారులకు మొరపెట్టుకున్నారు. – భువనేశ్వర్‌రెడ్డి, దివ్యాంగుడు, యర్రావారిపాళెం మండలం

15 వేలు నుంచి 6 వేలకు తగ్గింపు



అనారోగ్యంతో బాధపడుతున్న నాకు 90 శాతం వైకల్యం ఉండడంతో రూ.15 వేలు పింఛన్ ఇచ్చేవారు. అయితే రీవె రిఫికేషన్‌లో 75 శాతం వైకల్యం ఉన్నట్టు సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో రూ.15 వేలు పింఛన్‌ను రూ.6 వేలకు తగ్గించారు. రూ.15 వేలు ఇస్తేనే వైద్య ఖర్చులకు చాలడం లేదు. రూ.6 వేలు ఎక్కడికి సరిపోతాయి. ఇక నాకు అగచాట్లు తప్పవు.
– గోపీనాథ్, దివ్యాంగుడు, నారాయణవనం

ఇది న్యాయం కాదు



పాతికేళ్లుగా పింఛన్ తీసుకుంటున్నాను. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు రూ.200 పింఛను ఇవ్వగా ఆ సమయంలో పింఛనుకు దరఖాస్తు చేసుకున్నాను. అప్పటి నుంచి పింఛన్ పొందుతున్నాను. కూటమి నేతలు తమ ప్రభుత్వం వస్తే మరింత మేలు చేస్తామని చెబితే నమ్మి ఓటు వేశాను. ఆ సర్కారు కొలువుదీరిన ఏడాదికే నా పింఛన్ తగ్గించేస్తోంది. రెండు కాళ్లు పనిచేయక నడవలేని స్థితిలో ఉన్న నాకు రీవెరిఫికేషన్‌లో 55 శాతం మాత్రమే వైకల్యం ఉన్నట్టు నిర్ధారించారు. ఇది న్యాయం కాదు. – శ్రీనివాసులు, దివ్యాంగుడు, తాతయ్యగుంట, తిరుపతి

'తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన ఓ విద్యార్థిని పద్మావతి డిగ్రీ కళాశాలలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంది. దరఖాస్తు చేసుకుంటున్న క్రమంలో ఎస్సీ కేటగిరీ చెందిన ఆ విద్యార్థిని దరఖాస్తు ఓసీ కేటగిరీగా ఆన్‌లైన్‌లో నమోదైంది. దీంతో ఏమి చేయాలో పాలుపోనిస్థితిలో విజయవాడ ఉన్నత విద్యామండలిని సంప్రదించగా మేము ఏమీ చేయలేమని ఆప్షనల్ మార్పునకు ఇచ్చిన తేదీలో మాత్రమే ఎడిట్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థిని తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. ''

'శ్రీకాళహస్తికి చెందిన పరశురాం అనే విద్యార్థి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో అడ్మిషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రయత్నించగా ఓఏఎమ్‌డీసీ వెబ్‌సైట్‌లో వివరాలను నింపి సబ్‌మిట్ బటన్ నొక్కినా వివరాలు నమోదు కావడం లేదు. దీంతో వ్యవయ ప్రయాసల కోర్చి నేరుగా కళాశాలను సంప్రదించి హెల్ప్‌డెస్క్‌కు మొరపెట్టుకున్నారు. దీంతో కళాశాల సిబ్బంది ఆ విద్యార్థి వివరాలు ఆఫ్‌లైన్ దరఖాస్తు ద్వారా స్వీకరించారు.'



వివరాలు ఆఫ్‌లైన్

- డిగ్రీ ప్రవేశాల ఆన్‌లైన్ దరఖాస్తుకు అవస్థలు
- మొరాయిస్తున్న ఓఏఎండీసీ వెబ్‌సైట్
- తప్పుల తడకగా నమోదవుతున్న వివరాలు
- అయోమయంలో విద్యార్థులు
- నేటితో ముగియనున్న దరఖాస్తుల గడువు

తిరుపతి సిటీ: ఉన్నత విద్యామండలి అమలు చేసిన ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ దరఖాస్తుల దశలోనే విద్యార్థులకు చుక్కలు చూపుతోంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే క్రమంలో ఓఏఎండీసీ వెబ్‌సైట్ మొరాయించడం, ఎప్పుడు ఓపెన్ అవుతుందో తెలియని దుస్థితి నెలకొంది. వెబ్‌సైట్ ఓపెన్ అయినా దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల వివరాలు తప్పుగా నమోదవుతున్నాయి. దరఖాస్తును ఎడిట్ చేసుకుందామనుకున్నా.. ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారు. తాము ఆన్‌లైన్ దరఖాస్తులో నింపిన వివరాలకు సబ్మిట్ చేసిన తర్వాత వెలువడే వివరాలకు వ్యత్యాసం ఉందని వాపోతున్నారు. సాఫ్ట్‌వేర్‌లోనే ఏదో తప్పిదాలున్నాయని వెంటనే ఉన్నత విద్యామండలి చొరవ చూపాలని కోరుతున్నారు. మంగళవారంతో దరఖాస్తుల గడువు ముగియనుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు దరఖాస్తులు సంబంధిత కళాశాలలకు చేరాయా? లేదా అనే అయోమయంలో పడ్డారు.

ఆన్‌లైన్ అంతా అస్తవ్యస్తం



నాలుగు నెలలు ఆలస్యంగా డిగ్రీ ప్రవేశాలను చేపట్టిన ప్రభుత్వం ఆన్‌లైన్ దరఖాస్తులను సైతం అస్తవ్యస్తంగా మార్చింది. దరఖాస్తు చేసుకోవాలంటే నెట్ సెంటర్ల చుట్టూ రోజుకు పది మార్లు తిరుగుతున్నాం. ఏ టైంలో వెబ్‌సైట్ ఓపెన్ అవుతుందో అర్థం కాదు. విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం సర్వనాశనం చేసింది.
– కుమార్‌రెడ్డి, విద్యార్థి తండ్రి, తిరుపతి

యుద్ధం చేయాల్సి వస్తోంది



డిగ్రీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలంటే యుద్ధం చేయాల్సి వస్తోంది. మా అబ్బాయి తిరుపతి నగరంలోని ఓ ప్రముఖ కళాశాలలో బీఎస్సీ కోర్సుకు దర ఖాస్తు చేసుకోవాలని నెట్‌సెంటర్‌ను సంప్రదిస్తే కనీసం రెండు రోజులు పట్టింది. వెబ్‌సైట్ రూపకల్పనలో ఉన్నత విద్యామండలికి స్పష్టత లేనట్టు ఉంది. సాఫ్ట్‌వేర్ పూర్తిగా తప్పుల తడకగా కనిపిస్తోంది.
– సరస్వతి, ప్రైవేటు కళాశాల అధ్యాపకురాలు, తిరుపతి

విద్యార్థులకు శాపం



ఇంటర్ ఫలితాలు విడుదలైనా సింగిల్, డబుల్ మేజరంటూ విద్యార్థులను మభ్యపెట్టి, ఎట్టకేలకు డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినా అందులోనూ అంతా అయోమయే. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ విద్యార్థులకు శాపంగా మారింది. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా ఆయా కళాశాలలు మళ్లీ ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుందంటూ మెలిక పెట్టడం దారుణం.
– భగత్ రవి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి

అదృష్టం ఉండాల్సిందేనా?



డిగ్రీ ప్రవేశాలకు ఏర్పాటు చేసిన ఆన్‌లైన వెబ్‌సైట్ విద్యార్థులకు నరకం చూపిస్తోంది. దరఖాస్తు చేసుకోవాలంటే అదృష్టం ఉండాల్సిదే. సాఫ్ట్‌వేర్‌లో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒక కోర్సుకు దరఖాస్తు చేస్తే మరో కోర్సుకు దరఖాస్తు చేసుకున్నట్లు కనిపిస్తోంది. ఉన్నత విద్యామండలి అసమర్థత స్పష్టంగా కనిపిస్తోంది. – ప్రవీణ్ కుమార్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి, తిరుపతి

క్లుప్తంగా

మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి : చంద్రగిరిలో ఈ నెల 30 నుంచి 31 రోజులు మహిళలకు టైలరింగ్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ పి.సురేష్‌బాబు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్లలోపు మహిళలు అర్హులని తెలిపారు. కనీస విద్యార్హత 10వ తరగతి చదివి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీలు ఇస్తామని వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలు తీసుకుని పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 63017 17672లో సంప్రదించాలని తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

స్విమ్స్ ఓపీలకు రేపు సెలవు

తిరుపతి తుడా: వినాయక చవితి పర్వదినం సందర్భంగా బుధవారం స్విమ్స్ ఆస్పత్రిలో ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్టు డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. అత్యవసర సేవలు కొనసాగుతాయని, రోగులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

28న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తుమ్మలగుంట గ్రౌండ్‌లో ఈ నెల 28వ తేదీన అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌కు క్రీడాకారుల ఎంపిక చేయడానికి పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి ఎస్.రాబర్ట్ రాజేంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూసిన క్రీడాకారులను సెప్టెంబరు 25 నుంచి 27వ తేదీ వరకు ఏలూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధారుకార్డు, బర్త్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 86868 67079 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 106 అర్జీలు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 106 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థిక పరమైన లావాదేవీలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

వింగ్ టెక్ ఉద్యోగుల బైఠాయింపు

- వింగ్ టెక్, లెక్చర్ కంపెనీలకు వ్యతిరేకంగా నినాదాలు
- పరిశ్రమ యాజమాన్యంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు
- సమస్యను పరిష్కరించాలని స్పందనలో వినతి


పరిశ్రమ ముందు బైఠాయించిన ఉద్యోగులు

రేణిగుంట: మీ ఉద్యోగాలు మీకు ఇస్తామని పరిశ్రమ యాజమాన్యం నమ్మించి మోసం చేసిందని యాజమాన్యంపై చీటింగ్ కేసు నమోదు చేయాలని కోరుతూ 205 మంది ఉద్యోగులు ఏర్పేడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని ఈఎంసీ-2 క్లస్టర్‌కు చెందిన వింగ్ టెక్ మొబైల్ కమ్యూనికేషన్ కంపెనీకి చెందిన 205 మంది ఉద్యోగులు సోమవారం ఉదయం కంపెనీ ప్రధాన ద్వారానికి ఎదురుగా బైఠాయించి నిరసన తెలిపారు. సంఘటన స్థలానికి రూరల్ సీఐ మంజునాథరెడ్డి, ఎస్ఐ సుధాకర్ చేరుకుని ఉద్యోగులతో చర్చించారు. చర్చల అనంతరం ఉద్యోగులు ఏర్పేడు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తమను మోసం చేశారంటూ వింగ్ టెక్, లెక్చర్ కంపెనీల యాజమాన్యంపై ఫిర్యాదు చేశారు. చీటింగ్ కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఉద్యోగులు తిరుపతి కలెక్టరేట్ చేరుకుని పీజీఆర్ఎస్‌లో తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఉద్యోగులకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.

యాజమాన్యం మోసం చేసింది



గత వారంలో ఉద్యోగులమంతా నిరసన తెలిపాం. యాజమాన్యం ప్రతి నిధులను పంపించి, మాతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇంతవరకు ఎటువంటి న్యాయం చేయలేదు. యాజమాన్యంపై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయండి.
– చంద్రకళ, ఉద్యోగిని, వింగ్ టెక్ పరిశ్రమ

మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి



గతంలో మేము ఉద్యోగాల్లో చేరేటప్పుడు శాశ్వత ఉద్యోగులుగా మిమ్మల్ని తీసుకుంటున్నామని చెప్పారు. కానీ ఇప్పుడు పరిశ్రమ మరొకరి చేతికి వెళ్లడంతో వాళ్లు మాకు సంబంధం లేదంటున్నారు. రెండు పరిశ్రమల యాజమాన్యం ఉద్యోగుల భవితవ్యంతో ఆడుకుంటున్నారు. ప్రభుత్వం చొరవ చూపి, మాకు న్యాయం చేయాలి.
– బాలాజీ, ఉద్యోగి, వింగ్‌టెక్ పరిశ్రమ

ప్రభుత్వం జవాబు చెప్పాలి



గతంలో చంద్రబాబు సమక్షంలో పదివేల మందికి ఉద్యోగాలు ఇస్తామని వింగ్‌టెక్ ఒప్పందం కుదుర్చుకుంది. కానీ పది వేల మంది మాట అటుంచితే ప్రస్తుతం పని చేస్తున్న 200 మందిని తీసివేయడం దారుణం. దీనికి కచ్చితంగా ప్రభుత్వమే బాధ్యత వహించాలి. పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నామని ప్రజలను మోసం చేస్తోందనడానికి ఇదే ఉదాహరణ.
– బాలసుబ్రమణ్యం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

బార్..బోర్లా

- జిల్లాలో నాలుగే దరఖాస్తులు
- నేడే ఆఖరి రోజు..

తిరుపతి క్రైమ్: జిల్లాలో నాడు మద్యం షాపుల కోసం పెద్ద ఎత్తున పోటీ పడిన వ్యాపారులు.. ఇప్పుడు బార్ల విషయానికి వచ్చేసరికి వెనక్కి తగ్గారు. ఊరూరా బెల్టుషాపులతోపాటు మద్యం షాపులకు పర్మిట్ రూమ్‌లు ఇవ్వడంతో బార్ల నిర్వహణ అంత సులభం కాదని ఆసక్తి చూపడం లేదు. మద్యం షాపుల వద్ద విక్రయాల్లో సమయపాలన పాటించకపోవడం కూడా మరో కారణంగా తెలుస్తోంది. నూతన మద్యం బార్ల లైసెన్సుల కోసం అధికారులు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసినా వ్యాపారుల నుంచి పెద్దగా స్పందన రాలేదు. గత వారంలో నోటిఫికేషన్ జారీ చేస్తే ఇప్పటివరకు తిరుపతికి రెండు, చంద్రగిరి, నాయుడుపేటకు ఒక్కొక్కటి టెండర్లు వచ్చాయి. టెండర్లు అధిక సంఖ్యలో రావాలంటే ప్రభుత్వానికి బార్ల నోటిఫికేషన్ గడువు పెంచే అవకాశం తప్ప, మరో దారి కనిపించదని మద్యం వ్యాపారులు చెబుతున్నారు.

ఈ లొసుగే కారణమా!

జిల్లావ్యాప్తంగా 2025-28 సంవత్సరానికి వరకు బార్లు నిర్వహించుకునేందుకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో కల్లు గీత కార్మికులకు మూడు బార్లు కేటాయించగా.. ఓపెన్ క్యాటగిరి లో 32 బార్లకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇలాంటి పాలసీ ఇప్పటివరకు ఎవరు తీసుకురాలేదని ఇదే ఉత్తమమైన పాలసీ అని ఎక్సైజ్ అధికారులు సొంత డబ్బా కొట్టుకున్నారు. దీని ద్వారా మద్యం వ్యాపారులకు అధిక లాభం వస్తుందని చెప్పినా మద్యం వ్యాపారులు మాత్రం ఇవన్నీ కూడా ఉత్తుత్తి మాటలేనని బార్ల టెండర్లకు దూరంగా ఉంటున్నారు. మద్యం దుకాణాలతో పోలిస్తే బార్ లైసెన్సులకు ఫీజులు కూడా తక్కువగానే ఉన్నాయి. ప్రతి బారుకు నాలుగు టెండర్లు వస్తేనే.. లాటరీ తీస్తాను అనడం, ఒక్కో దరఖాస్తుకు రూ.5 లక్షలు టెండర్ ఫీజు, రూ.10 వేలు ప్రాసెసింగ్ ఫీజు పెట్టడం, అది కూడా నాన్ రిఫండబుల్ అమౌంట్ కావడం, ఈ పాలసీని నీరు కార్చుతోంది. ఇలాంటి షరతులవల్లే మద్యం వ్యాపారులు వీటికి దూరంగా ఉన్నట్లు తెలుస్తుంది. గతంతో పోలిస్తే ఇప్పుడు రెస్టారెంట్లు నడపడానికి ఖర్చులు కూడా బాగా పెరిగిపోవడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు.

ప్రజా ప్రతినిధులకు కప్పం కట్టాల్సిందే..!

ఇటీవల జరిగిన మద్యం షాపుల టెండర్లు దక్కించుకున్న వ్యాపారులు ప్రతి ఒక్కరూ ప్రజా ప్రతినిధులకు కప్పం కట్టింది తెలిసిన విషయమే.. తిరిగి అదే పరిస్థితి బార్ల విషయంలో కూడా నెలకొంటుంది. ప్రతి బార్ నుంచి కూడా ప్రజాప్రతినిధులకు నెలనెలా కూడా నెలసరి మామూలు ఇవ్వాలని ఇప్పటికే రెగ్యులర్‌గా టెండర్లు వేసే మద్యం వ్యాపారులకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తుంది. ఇవన్నీ కూడా ఈ పాలసీ పైనే పడడంతో నూతన బార్ టెండర్లు బోల్తా పడ్డాయి.

గడువు పెరిగేనా...

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బార్ లైసెన్స్ ల దరఖాస్తుల గడువు మంగళవారంతో ముగియనుంది. జిల్లాలో ఇప్పటివరకు నాలుగు బార్లకే టెండర్లు వచ్చాయి. మూడు దుకాణాలున్న కల్లుగీత కార్మికులు కూడా ఇంతవరకు బార్లపై కన్నెత్తి చూడలేదు. దీంతో ప్రభుత్వం మరి కొన్ని రోజులు ఈ టెండర్లకు గడువు పొడిగించే అవకాశం కనిపిస్తుంది.

సమస్యలు రాకుండా చర్యలు తీసుకోండి

తిరుపతి అర్బన్: అనధికార లేఅవుట్లలోని ప్లాట్స్ రెగ్యులైజేషన్‌కు ప్రభుత్వం మూడు నెలలు గడువు ఇచ్చిందని, సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో లేఅవుట్ రెగ్యులైజేషన్ పథకం లక్ష్యాలు, నిబంధనలు, దరఖాస్తు ప్రక్రియ, టెక్నికల్ పర్సన్స్ పాత్రపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డితోపాటు తుడా వైస్ చైర్మన్ శుభం బన్సల్, తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టెక్నికల్ పర్సన్లు లేఅవుట్ దారులకు కచ్చితమైన వివరాలను ఇవ్వాల్సిన బాధ్యతను గుర్తు చేస్తూ, నిబంధనల ప్రకారం మ్యాపులు తయారు చేయడం, అప్లికేషన్లను సమర్థవంతంగా ప్రాసెస్ చేయడం గురించి అధికారులు వివరించారు.

మొదటి ఘాట్ రోడ్డులో కారు ప్రమాదం


ప్రమాదానికి గురైన కారు

తిరుమల : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో సోమవారం కారు అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొంది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ఇద్దరు భక్తులు కారులో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరిగి సొంతూరుకు బయలుదేరారు. మొదటి ఘాట్ రోడ్డులో 12వ కిలోమీటర్ వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రక్షణ గోడను ఢీకొని ఆగిపోయింది. ఈ ప్రమాదంలో భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వెంటనే సమాచారం అందుకున్న టీటీడీ ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది అక్కడికి చేరుకుని కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. తిరుమల ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఐ రామస్వామి

సత్యవేడు: ఏటీఎంలో డబ్బు డ్రా చేసుకునేందుకు వచ్చే అమాయకులను టార్గెట్ చేసి వారి ఏటీఎంలను మార్చి డబ్బు తీసుకుంటున్న నిందితుడు పి. సుబ్రమణ్యం(40)ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామస్వామి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు..సత్యవేడు స్టేట్ బ్యాంకు ఏటీఎం వద్దకు గత 18వ తేదీన సత్యవేడు మండలం కన్నావరం గ్రామానికి చెందిన రవి ఏటీఎంలో తన ఖాతా నుంచి డబ్బు డ్రా చేసుకునేందుకు వచ్చాడు. తనకు ఏటీఎంలో డబ్బు ఎలా డ్రా చేయాలో తెలియకపోవడంతో అక్కడే ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని డబ్బులు డ్రా చేసి ఇవ్వాలని కోరాడు. ఏటీఎంలో కార్డులు పని చేయడం లేదని చెప్పి, అతని వద్ద ఉన్న మరో ఏటీఎం కార్డు ఇచ్చి వెళ్లాడు. మరుసటి రోజున రవి ఫోన్‌కు రూ.40 వేలు డ్రా చేసినట్లు మేసేజ్ వచ్చింది. బాధితుడు తాను డబ్బు డ్రా చేయకపోయి ఎవరో తీశారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు చిత్తూరు ఏటీఎంలో డ్రా చేసినట్లు గుర్తించి, నిందితుడి కోసం వల పన్నారు. సోమవారం సత్యవేడుకు వచ్చి ఏటీఎం వద్ద అనుమానంగా తిరుగుతుండగా అతన్ని అరెస్టు చేశారు. విచారణలో తనే ఏటీఎంలో డబ్బు డ్రా చేసినట్లు అంగీకరించాడు. కోర్టుకు హాజరు పరచి, రిమాండ్‌కు తరలించారు.

నగరంలో సీవీఐఆర్ఎంఎస్ అమలు


సీవీఐఆర్ఎంఎస్ గురించి వివరిస్తున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైం : తిరుపతి నగరంలో ప్రజా భద్రత, నేర నిరోధక చర్యలను మరింత బలోపేతం చేయడానికి సిటీ విజిటర్ ఇన్ఫర్మేషన్ అండ్ రికవరీ మేనేజ్‌మెంట్ సిస్టం(సీవీఐఆర్ ఎంఎస్)ను అమలు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ వ్యవస్థను హోటళ్లు, లాడ్జీలు, పీజీ సెంటర్లలో అమలుచేస్తున్నట్టు తెలిపారు. అక్కడ చేరేవారు తమ వివరాలకు సంబంధించి గుర్తింపు కార్డులు నమోదు చేయగానే పోలీసు రికార్డులతో అనుసంధానం అవుతాయని తెలిపారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులు వస్తే వెంటనే అలర్ట్ వచ్చే విధంగా ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఇప్పటి వరకు 664 హోటళ్లు, హోమ్ స్టేలలో సిస్టంను ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన వాటిల్లోనూ పూర్తి చేస్తామన్నారు. ఇందులో ఆధార్ ఐ కనెక్ట్‌ను కూడా తీసుకుంటామన్నారు. ఇకమీదట ఈ సిస్టం పోలీసు స్టేషన్లో అమలు అవుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్పీ వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 72,119 మంది స్వామిని దర్శించుకున్నారు. 25,294 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.02 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించేది లేదని స్పష్టం చేసింది.

తుడా చైర్మన్ చాంబర్ వద్ద
శెట్టిపల్లె బాధితుల ఆందోళన


శెట్టిపల్లి భూబాధితులను బుజ్జగిస్తున్న తుడా చైర్మన్

తిరుపతి తుడా: శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బాధితులు సోమవారం మంత్రి నారాయణ సమావేశం నిర్వహిస్తున్న తుడా చైర్మన్ చాంబర్‌ను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ శుభం భన్సల్ శెట్టిపల్లె భూ బాధితులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. భూ సమస్యను పరిష్కరించేందుకు తాము ప్రభుత్వానికి నివేదికలు పంపామని, మూడు నెలల్లోపు పరిష్కరించేందుకు కృషి చేస్తానని దివాకర్ రెడ్డి హామీ ఇవ్వడంతో వెనుతిరిగారు.

తెరపైకి స్కావెంజర్స్ కాలనీ వ్యవహారం

తిరుపతి స్కావెంజర్స్ కాలనీలోని అందరూ సహకరిస్తే స్థలాన్ని ఖాళీ చేయించి బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని కట్టించి ఇస్తానని మంత్రి నారాయణ విలేకరుల సమావేశంలో చెప్పారు. గతంలోనూ ఈ ప్రతిపాదన చేశామని, అయితే కొందరు ఈ విషయాన్ని వివాదాస్పదం చేశారని మంత్రి చెప్పుకొచ్చారు . తాను తాటాకుల గుడిసెలోనే చదువుకుని, ట్యూషన్లు చెప్పుకుని ఈ స్థాయికి వచ్చానని గుర్తు చేశారు. గుడిసెల్లో ఉండే బాధలు తనకు తెలుసు కాబట్టి అందరూ సహకరిస్తే మంచి బహుళ అంతస్తుల భవనాన్ని కట్టించి బాధితులు అందరికీ అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

కూటమి వంచనలు చూడలేకే
వైఎస్సార్‌సీపీలో చేరిక


టీడీపీ నేతలకు కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డి

- 33వ వార్డు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరిక
- జగనన్న పాలనలోనే పేదలకు నిజమైన సంక్షేమం
- జగనన్న వంటి నాయకుడే రాష్ట్రానికి సీఎంగా అవసరం

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించడాన్ని చూడలేక వైఎస్సార్‌సీపీలో చేరామని టీడీపీ నాయకులు రాజేంద్రరాయల్, పురుషోత్తంనాయుడు పేర్కొన్నారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయం వద్ద సోమవారం తిరుపతి 33వ డివిజన్‌కు చెందిన టీడీపీ అధ్యక్షులు రాజేంద్రరాయల్, పురుషోత్తం నాయుడుతోపాటు 50 మందికి పైగా వారి అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రజలకు మేలు జరుగుతుందని ఎంతో ఆశించామన్నారు. అయితే కూటమిలో ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా ఉంటూ ప్రజల సంక్షేమాన్ని, ప్రజాసమస్యల పరిష్కారాన్ని పూర్తిగా గాలికి వదిలేశారన్నారు. తాము టీడీపీ నాయకులుగా వార్డుల్లో తిరగాలంటే ముఖం చెల్లడంలేదన్నారు. చంద్రబాబు అధికారం కోసం మోసపూరిత వాగ్దానాలు చేసి, ప్రజలను ఇంతగా మోసగిస్తారనుకోలేదన్నారు. ఏడాదన్న కాలంలోనే కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను మూటకట్టుకుందని చెప్పారు. గతంలో ఏ రాజకీయపార్టీకి ఇంతగా వ్యతిరేకత రాలేదని, అలాంటి టీడీపీలో ఉంటే ప్రజలతో ఛీ కొట్టించుకోవడం తప్ప ప్రజల మన్నన పొందలేమన్నారు. ప్రతి పేదవాడికి అనేక సంక్షేమ పథకాలు అందించిన ఏకైక నాయకుడు జగనన్న మాత్రమేనన్నారు. జగనన్న లాంటి నాయకుడే రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. తిరుపతిలో భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డిలు చేసిన అభివృద్ధి గత 40ఏళ్ల చరిత్రలో ఏ రాజకీయ నాయకుడు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సాకం ప్రభాకర్, పోలిరెడ్డి నాగిరెడ్డి, సయ్యద్ షఫీ, అహ్మద్‌ఖాదరీ, లక్ష్మీ వెంకటేష్, గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్సెల్ జిల్లా అధ్యక్షులు మద్దాలి శేఖర్, ప్రచార కమిటీ నగర అధ్యక్షుడు రమణారెడ్డి, పార్టీ నాయకులు పడమటి కుమార్, వెంకటేష్‌రాయల్, సుధాకర్, పద్మజ, విజయలక్ష్మి, రాధ, ఉష తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి దుకాణాల కూల్చివేత


జేసీబీలతో షాపులను నేలమట్టం చేస్తున్న దృశ్యం

రేణిగుంట : బస్టాండ్ సమీపంలోని ఏడు దుకాణాలను ఆదివారం అర్ధరాత్రి కూల్చివేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంచాయతీ నుంచి స్థానికులు స్థలం లీజుకు తీసుకుని గదులు నిర్మించుకుని దుకాణాలు నిర్వహించుకుంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత షాపులను ఖాళీ చేయించారు. అక్కడితో ఆగకుండా జేసీబీతో ఏడు షాపులను నేలమట్టం చేసేశారు. పంచాయతీ, రెవెన్యూ, ఆర్‌టీసీ అధికారులు ఈ పని చేశారా..? లేదా టీడీపీ నేతల నిర్వాకమా..? అర్థం కావడం లేదని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ ఈఓను సంప్రదించేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

పంచాయతీ తీర్మానం ప్రకారమే తొలగించాము

బస్టాండ్ వద్ద ఖాళీగా ఉన్న గదులను గతంలో తొలగించాలని పంచాయతీ తీర్మానం చేసింది. అందులో భాగంగా గత రాత్రి సిబ్బంది ఆ గదులను తొలగించారు. – మాధవి పంచాయతీ ఈవో రేణిగుంట

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

- అర్హులైన వారికి టీడీఆర్ బాండ్లు
- శెట్టిపల్లి భూముల సమస్య త్వరలో పరిష్కరిస్తాం
- పురపాలక శాఖ మంత్రి నారాయణ


మాట్లాడుతున్న మంత్రి నారాయణ

తిరుపతి తుడా: ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పీ నారాయణ అన్నారు. సోమవారం తుడా కార్యాలయంలో నగరపాలక సంస్థ ,తుడా అధికారులతో అభివృద్ధి పనులు, ప్రజలకు కల్పించాల్సిన వసతులపై మంత్రి నారాయణ సమీక్షించారు. తుడా టవర్స్, ప్లాట్స్, దుకాణాలపై వచ్చే ఆదాయ, వ్యయాలపై తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, వీసీ, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, నగరపాలక సంస్థలో పారిశుద్ధ్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కార్మికులకు కల్పించాల్సిన వసతులపై కమిషనర్ ఎన్ మౌర్య వివరించారు. మంత్రి మాట్లాడుతూ టౌన్ షిప్‌లను అభివృద్ధి చేసి తుడా ఆదాయన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. తుడా ప్రాజెక్ట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, త్వరలో శెట్టిపల్లి భూముల సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, పక్కా ప్రణాళికతో ముందుకెళ్లి లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించే నివేదికలను ఇవ్వకుండా వాస్తవాలను వివరించి, ప్రజల సమస్యలు పరిష్కరించాలని, నెల్లూరు తరహాలో తిరుపతిలో కూడా రోడ్ల శుభ్రతకు స్వీపింగ్ మిషన్లను వినియోగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు కృష్ణారెడ్డి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత గోడ ధ్వంసం

- డీఎస్పీకి ఫిర్యాదు


ధ్వంసమైన ప్రహరీగోడ

కోట: మండలంలోని కర్లపూడి దళితవాడలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి పాముల సురేంద్రకు చెందిన ప్రహరీ గోడను సోమవారం కొందరు దౌర్జన్యంగా కూల్చివేశారు. దీనిపై బాధితుడు సురేంద్ర కుటుంబ సభ్యులతో కలసి గూడూరు డీఎస్పీ గీతాకుమారికి ఫిర్యాదు చేశారు. ఆయన కథనం మేరకు.. కర్లపూడి దళితవాడలో పాముల సురేంద్ర పదేళ్ల క్రితం ప్రహరీ గోడ నిర్మించుకున్నారు. ఇంట్లో తాము లేని సమయంలో ఆ గ్రామానికి చెందిన పుచ్చలపల్లి క్రిష్ణయ్య, శ్రీనివాసులు, బైనా చిన్నయ్య ఇంట్లోకి చొరబడి గోడను కూల్చివేశారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పేర్నాటి ఆనందరెడ్డి, ఎస్ఐ పవన్‌కుమార్ అక్కడే ఉండి గోడను కూల్చివేయమని చెప్పినట్లు బాధితుడు వాపోయాడు. ఇంతలోనే వారు అక్కడకు చేరుకుని ప్రశ్నించగా టీడీపీ నాయకుడు ఆనందరెడ్డి తనతో పాటు కుటుంబ సభ్యులందరినీ కులం పేరుతో దూషిస్తూ 'మాకే ఎదురు తిరుగుతార్రా.. మీకు తగిన శాస్తి చేస్తాం.' అని బెదిరించాడని పాముల సురేంద్ర తెలిపారు. దీనిపై విచారణ జరిపి దళితులమైన తమకు రక్షణ కల్పించి, వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. విచారణ జరిపించి న్యాయం చేస్తానని డీఎస్పీ వారికి తెలిపారు.

ప్రశ్నార్థకంగా విద్యార్థుల భద్రత


రేణిగుంట ఓల్డ్ చెక్ పోస్ట్ సమీపంలో వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు

రేణిగుంట : ఎయిర్‌పోర్టు సమీపంలోని బీజీఎస్ నేషనల్ పబ్లిక్ స్కూల్ బస్‌లో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. డ్రైవర్ వ్యవహారశైలితో పిల్లలు భయాందోళనకు గురవుతున్నారు. రహదారి భద్రతా నియమాలను బేఖాతర్ చేస్తూ అత్యంత వేగంగా వాహనం నడుపుతున్నాడు. దీంతో విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధిలేని పరిస్థితుల్లో స్కూల్ బస్‌లో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం సైతం పాత చెక్‌పోస్టు వద్ద ఇష్టారాజ్యంగా బస్ నడిపి స్థానికులను ఢీకొట్టినంత పనిచేశాడు. పైగా ప్రశ్నించిన వారితో దురుసుగా ప్రవర్తించాడు. దిక్కున్న చోట చెప్పుకోండంటూ వెళ్లిపోయాడు. రవాణా శాఖ అధికారులు దీనిపై తగు చర్యలు చేపట్టాలని, పాఠశాల యాజమాన్యం డ్రైవర్ పనితీరును పర్యవేక్షించాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.